మరమ్మతు

భావరాజు నరసింహారావు

౧

శాసనోల్లంఘనమూ, సత్యాగ్రహమూ మాంచి ముమ్మరంగా ఉన్నరోజు లవి. మహాత్ముని శంఖారావమువిని, భరతమాత యొక్క హృదయవిదారమైనస్థితి గ్రాహ్యం చేసుకొని, సముద్రతరంగాల్లాగు పొంగిపోతూన్న హృదయాలతో ముందువెనుకలు ఆలోచించకుండా, మాతృదేశసేవయే కర్తవ్యతమమని మనస్ఫూర్తిగా నమ్మి, శాంతి సమరంలోనికి దూకిన అరువదివేలకుపైగా ఉన్న ఆ శాంతి సైనికదళంలో నే నొకడను. జైలుతిండి పడక ఆరోగ్యము పాడైపోయి కొన్నాళ్లదాకా యెందుకూ పనికిరాకుండా ఉన్న అభాగ్యులలోకూడా నేనొకణ్ణి.

*   *   *   *

...ఆరోజంతా నాలో ‘శాంతిదళంలో కలియవద్దు- జైలులోకూర్చుని చిక్కి, శల్యమైపోవడమేకాని చేసేదేమీ ఉండదు- తరువాతనన్నా చెడిపోయిన ఆరోగ్యం బాగు చేసుకోవడమే సరిపోతుందిగాని దేశసేవచేయడానికి తగినదార్ఢ్యం ఉండదు- బైటనే ఉండి యింటికి, ఒంటికి బాధలేకుండా పనిచేయా’ లని చెవిని యిల్లుకట్టుకు పోరి పసివాణ్ణి- రాముణ్ణి- పక్కలోబెట్టుకుని నిద్రిస్తున్న నా గృహలక్ష్మిని- వాణిని- విడిచిపెట్టి, ఆరాత్రే శాంతిదళంలో చేరబోతూంటే గౌతమబుద్ధుడు, నలుడు యిత్యాదులంతా భార్యావియోగసమయంలో పడ్డ బాధంతా ఒక్కసారి నన్నావేశించి ఒళ్లంతా పులకితమైపోయింది. నేనే చిత్రకారుణ్ణయితే- కవినైతే- ఇప్పటికికూడా ఏకాంతంగాకూర్చుని ఒక్కసారి హృదయంలోకి చూసుకుంటే యింకా చెక్కుచెదరని ఆరమ్యచిత్రము ద్యోతకమౌతూంటుంది.

ఆ గుడ్డి ‘బెడ్ రూమ్ లైటు’ వెల్తుర్లో ఒక్కసారి నా రాముడి శిరస్సాఘ్రాణించి, అధరాలు తగలకుండా (నిద్రనుండి లేస్తాం దేమోనని) నా ప్రియురాలిని ముద్దిడుకున్నాను.

“నేను జైలుకు వెళ్లాననే దిగులుతో నీ ఆరోగ్యం, పిల్లవాడి ఆరోగ్యం పాడు చేసుకోక, ఆత్మహత్య మొదలైన తెలివితక్కువపను లేవీ చెయ్యక......... భద్రంగాఉండ”మని ఏవో నాలుగుముక్కలు వ్రాసి ఆ చీటీని నా ‘టేబిల్’ మీద ఉంచాను. గదితలుపు తీసే ఉంచి, వీధిగుమ్మం మాత్రం చప్పుడు కాకుండా బైటనుంచే లోగడియవేసి ఆరాత్రే ‘మెయిల్’ఎక్కాను. రైలు మా ఊరికి దూరమైపోతున్నకొద్దీ నాకు దుర్భరమైన ఆవేదన కలుగుతోంది. అందుకు సరియైన కారణం చెప్పలేను కాని

నా హృదయ భాగస్వాములు-నా భార్యాపుత్రులు-ఆ నిర్వికారావస్థలో, సుషుప్తిపొందుతూ అనుక్షణం నామనోవీథికిఅడ్డుతగుల్తూ ఉన్నారు. ఎవరికుండదూ ఆ దిగులు?— నిక్షేపంలాంటి పాతికేళ్ల భార్యను, మరపునకురాని ముద్దుమాటలతో మనస్సును నించిన రెండేళ్ల కొడుకును, మళ్లీ యీ జన్మకు కలసుకుంటానో లేదో అన్నంత సందిగ్ధావస్థలో విడచిపోతుంటే? హృదయమున్నవారికి అర్థమౌతుంది నా ఆ వేదన.

2

రెండు నిండు సంవత్సరాలు గడచినవి బళ్లారిజైలులో. పైన జరిమానా చెల్లించనందుకు వేసిన ఆరువారాల ఖైదు జైలులో నా మంచి ప్రవర్తనకు బహుమానంగా రద్దు చేశారు ప్రభుత్వంవారు.

విడుదలై, ఆ ఊళ్లోనేఉన్న మా బావ-వెంకట్రావు-గారింటికి వెళ్లాను. అప్పటికి పది రోజులనుంచీ మావాణి అక్కడే ఉంది నా విడుదల కెదురుచూస్తూ. రెండు రోజులు అక్కడే ఉండి మూడవనాడు బయలుదేరాం మా ఊరికి.

* * * *

అప్పటికి మా రైలు గుంతకల్ వచ్చి గంట దాటింది; తొమ్మిదిగంటలైనా యింకా రాలేదు మెయిలు మద్రాసునుంచి. ఏమీ తోచక యే స్నేహితుడైనా కనబడితే బాగుండునని చూస్తూన్నాను. అలాగ కొంతకాలం గడచింది. పరిచితులెవరూ కనబడలేదు గాని, ఒక అపరిచిత వ్యక్తిమాత్రం మా పెట్టె ఎదుట బోనులో పులిలాగు ఇటూ అటూ తిరుగుతున్నాడు. పాతిక సంవత్సరాలుంటాయి; 'మాంచెస్టరు ఖద్దరు' ధరించాడు. ఆ వైఖరీ అదీ చూచి కొంత సంపన్నకుటుంబానికి చెందిన రెడ్డికులస్థుడైయుంటాడని ఊహించాను. ఇన్నీ ఊహించాను గాని అలా ఎందుకు తిరుగుతూన్నాడో, ఏమి చేయా లనుకుంటున్నాడో మాత్రం బుర్రకు తట్టలేదు. ఒకటి రెండుసార్లు నాతో మాట్లాడటానికి కుతూహలపడి కూడా అప్రయత్నంగా మానినట్లు నాకు తోచింది.

3

మెయిలు వచ్చింది; రకరకాలమనుష్యులూ దిగి తలొక రైలులోకి యెక్కుతూన్నారు. 'ఆంధ్రపత్రిక' తీసుకుని మా పెట్టె యెక్కబోతూండగా ఎవరో నన్ను పిల్చారు. చూస్తును గదా కొన్నాళ్లు నాతోబాటు జైల్లోఉండి వెల్లూరుకు మార్చబడిన మరొక శాంతిదళమిత్రుడు. పత్రిక వాణికిచ్చి ఆయనదగ్గరకుపోయి మాట్లాడుతూండగా 'గార్డు' యీలవేశాడు. ఆయనతో సంభాషణ ముగించి, నేను రైలెక్కి తలుపువేయబోతూంటే యింతవరకూ మా పెట్టెముందు తిరుగుతూన్న ఆవ్యక్తి 'ఉండండి, ఉండండి' అంటూ ఎక్కి నాప్రక్కనే కూర్చున్నాడు.

పత్రిక చదివి నా కిచ్చింది వాణి; నేను చూస్తున్నాను. వెంటనే నా ప్రక్కనున్న

ఆమనిషి "నాకుకూడా ఒకకాగితం యిస్తారా?" అన్నాడు. నాకు కొంచెం కోపం వచ్చింది. అణా యిచ్చి పత్రిక కొనుక్కున్న నేను, దాని నింకా విప్పకముందే ఆమాత్రం ఆలోచించకుండా అడిగాడని. ఆ కోపంలో ఒకకాగితం యిత్తామనుకున్నవాణ్ణి యీపాడు అలవాటు మాన్పకపోతే మనదేశంలో పత్రికలు బాగుపడవు; అందుకు తీవ్రప్రయత్నం చేయాలని మనసులో ఆలోచిస్తూ పత్రికనంతా ఆ పెద్దమనిషికిచ్చి మారాముణ్ణి దగ్గరకు తీసుకున్నాను. వాడి కింకా నాగడ్డంబెరుకు తీరలేదు కాబోలు, మళ్లీ, యేడుపు ప్రారంభించాడు. నేను సముదాయించడానికి ప్రయత్నించినకొద్దీ వాడిశ్రుతి హెచ్చింది. ఇక లాభంలేదని మా ఆవిడ నవ్వుతూ పిల్లవాణ్ణి తీసుకుని బుజ్జగించింది.

* * * *

పత్రిక తెరచిఉంచాడన్న మాటేగాని ఆ పెద్దమనిషి దృష్టంతా మావాణిమీదే ఉంది. కాని దానికి తగిన కారణం లేకపోలేదు. ప్రబంధాల్లో వర్ణించినట్లు స్త్రీలు కూడా "మేముమగవాళ్లమై,- ఆవిడను..." అని లొట్టవేసేటంత అందకత్తె కాదేమో కాని మావాణి సామాన్యపు ఆడవాళ్లలో లెక్కవేయడానికిమాత్రం వీలులేదు.

నేను, మిగతాజనం తనసంగతంతా చూస్తున్నామనిగాని, తనలోని పశుప్రకృతి అందరికీ వ్యక్తమౌతోందని గాని గ్రహించకుండా అలా అరగంటసేపు చూస్తూకూర్చున్నాడు. కొంతసేపుండి "పత్రిక యిలాయివ్వండి" అన్నాను. దానికి ప్రత్యుత్తరం మాట అలా ఉంచి, యీ అరగంటసేపు ఆలోచిస్తున్నాడు కాబోలు నాకూ మావాణికీ గల సంబంధం...... "ఆవిడగారి దేవూరు?" అన్నాడు, మావాణికి వినబడేలాగు. నేను సాభిప్రాయంగా మావాణి వంక చూసి,

"బెజవాడలో ఉంటున్నారు ప్రస్తుతం."

"స్వగ్రామం?"

"వారిదేనా?"

ఆవిడసంగతి గాక నీ సంగతెవడికావాలన్నట్లు ముఖం చిట్లించి,

"వారిదే!"

"నంద్యాల."

ఆ వ్యక్తి మళ్లీ నన్నూ మావాణినీ ఒక్కసారి 'కంపేరు'చేసి చూసి మాకిద్దరకూ ఏ విధమైన సంబంధం లేదని పూర్తిగా గ్రహించినట్లు తల ఊపి, ఏదో ముఖ్యమైన విషయం జ్ఞాపకానికొచ్చినట్లు ముఖభావం మార్చి,

"ఆఁ! అలా చెప్పు! అప్పుడే అనుకున్నా!...... అన్నట్టు వారి పుట్టింటి పేరు.........?"

"వల్లూరివారు."

"అదే, అదే! ఆఁ! ఆ పంతులుగారి... ఎవరంటే?......ఆయన కూతురు కాదూ?"

"మీరు గురుగున్నారా వారిని?"

"ఆఁ! ఎరక్కేం?...వీర్రాజు గారు కాదూ?"

మా వాణి ఏదో మాట్లాడబోయి నా ముఖభావం గ్రహించి ఊరుకుంది.

"ఎబ్బె! పొరబడ్డారు... పేర్రాజుగారు."

"ఆఁ! ఆఁ! మర్చిపోయాను, పేర్రాజు గారు కాదూ? ఏదో 'రాజు'గారు కాని, సరిగ్గా గుర్తులేదు."

"..............."

"..............."

"ఛ! చ! పేర్రాజుకాదు, వీర్రాజు కాదు, ఆయనపేరు వెంకటరత్నంగారు!"

"............"

సూక్ష్మంలో పాదం నిక్షిప్తం చేశామే అని లోపల కొంచెం విచారపడ్డా పైకి కప్పిపుచ్చి

"పేర్లెక్కడ జ్ఞాపకముంటాయి? కాని ఆశ్చర్యంగా ఉంది! చిన్నప్పుడు వీళ్లింటి పక్కనే ఉండేవాళ్లం! ఎట్టా ఆడుకునేవాళ్లం! ఎంత మార్పు! చిత్రంగా ఉంది! ఈ ఆడవాళ్లను రెండేళ్ల క్రితం చూసినవాళ్లను యిప్పుడు గుర్తుపట్టలేము మనం మనమేమిటి? వాళ్లను పుట్టించిన బ్రహ్మకూడా అంతే. నిజంగా వాళ్ల......"

ఈసారి మా ఆవిడకు చాలా కోపం వచ్చి నాతో మెల్లగా 'ఏమిటి అలాచూస్తూ ఊరుకుంటారు......?' అంది. 'నువ్వు ఏమీ మాట్లాడక చూస్తూఉండు, మరేం భయం లేదు' అని చెప్పాను.

"..............."

"ఏమిటి అంటున్నారావిడ?"

"మీ సంగతే—ఎక్కడో చూచినట్టుంది...అంటున్నారు."

ఈ మాట నేననేసరికి అతనికి మహదానందం కలిగింది. వెంటనే మా వాణి నుద్దేశించి

"నన్ను మీరు గుర్తుపట్టారని యిందాకనే గ్రహించాను..... ఎంతమంది పిల్లలు మీకు?"

".. ...."

పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకోబోయాడు. వాణ్ణి మా ఆవిడ దగ్గరకు తీసుకుంది.

"పరవాలేదు, పిల్లవాణ్ణివ్వండి. మీ బాల్యస్నేహితులేగా!" అన్నాను.

"........." (నాకు ఒక తీక్ష్ణమైన చూపే జవాబు.)

"పిల్లవాడికి కొత్తగా ఉన్నట్టుంది, పోనీలెండి" అని ఊరుకున్నాడు.

* * * *

ఇహ నాక్షేమసమాచారాలు అడగటం ప్రారంభించాడు.

"అయితే నువ్వు ఎన్నాళ్లనుంచీ వీరింట్లో ఉన్నావు?"

"అబ్బో! ఆవిడ కాపరానికొచ్చినప్ప టినుంచీ ఉన్నాను."

"ఒక్కవంటపనేనా?..."

"అంతేగాని..."

"కాని...యింకా ఏం పనేమిటి?"

"ఏదో కొంచెం వ్రాత..."

"ఆఁ! వ్రాత? ఏం వ్రాత?"

"మరేవీ లేదండీ, ఎప్పుడన్నా బజారు నుంచి వేవన్నా తెస్తే ఏమీ తేడా లేకుండా 'లీస్టు' రాస్తాను."

(విరగబడినవ్వి, మా వాణివంక 'మీావం టవాడి తెలివితేటలు చూశారా?' అన్నట్టు ఒక్కసారి చూసి) నాతో (నా తెలివికి మెచ్చుకున్నట్టు)

"నీకు చదవటం, వ్రాయడం కూడా వచ్చునన్నమాట!"

పేపరల్లా పెట్టి కిటికీలోంచి ముందుకు చూసి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

౪

ఇంతలో ద్రోణాచలం వచ్చింది. ఆవ్యక్తి రైలుదిగి, కొంచెం సేపు ఏదో ఆలోచించుకుని, మా పెట్టెదగ్గరకువచ్చి చిటికవేసి నన్ను పిల్చాడు.

"ఇక్కడ దిగుతారా?" అన్నాను. 'లేదు లేద'ంటూ నన్ను కాఫీహోటలు దాకా తీసుకుపోయి తనతోబాటు తినమన్నాడు. నా కలవాటులేదు, జబ్బుచేస్తుందని చెప్పాను. వెంటనే నాలుగుచక్రకేళీపళ్లు తెచ్చి పుచ్చుకోమని బలవంతపెట్టాడు. విధిలేక పుచ్చుకున్నాను.

"..............."

"................."

"మరీ... ఆవిడసంగ తేమిటి?"

"ఏముంది......?"

"................."

"................."

"మంచిదేనా?"

"చాలామంచిది."

"అంటే?"

"యోగ్యురాలు."

"................."

"................."

"ఇప్పు డెక్కడ దిగుతారు?"

"నంద్యాల."

"అలాగా!..."

వెంటనే వెళ్లి నంద్యాలకు టిక్కట్టుకొని తెచ్చుకున్నాడు.

"ఇదిగో– యీాపదీ వాడుకో... పనిసాను కూలమైతే......యిల్లాంటివి లెక్కలేనన్ని."

"..."(ముఖంవంక చూసిఊరుకున్నాను.)

"మరేం ఫరవాలేదు" అని యింకో నోటుకూడా తీశాడు.

"నే నటువంటివాణ్ణి కాదండోయ్. స్నేహం శాశ్వతంగాని, వెధవ డబ్బేందుకండీ...?

కాని బ్రహ్మకు కూడా అలివి కాని పని తలబెట్టారు.

ఇంకా డబ్బు తక్కువని గునుస్తున్నానని కాబోలు ఒక వందరూపాయిల నోటు బలవంతాన నా తిలో పెట్టాడు.

ప్రపంచకంలో యిల్లాంటి మనుష్యులున్నారనే నమ్మకం నా కప్పుడు కలిగి ఖిన్నుణ్ణయిపోయాను.

* * * *

మళ్లీ రైల్లో యథాస్థానా లాక్రమించాం. ఇహ తన కథ మొదలుపెట్టాడు.

వాళ్ల ఊళ్లోకల్లా తమ కుటుంబమే బాగా డబ్బు గలదనీ, తాను చాలా 'యిండిపెండెంటు స్పిరిట్' గల స్వేచ్ఛా విహారిననీ, ఒకరిదగ్గిర ఉద్యోగం చేయడం తనకు ఇష్టం లేదనీ, అంచేత ఒక పత్రిక లేవదీసి దాంతో ఆంధ్ర దేశాన్ని మరమ్మతుచేయబోతున్నాననీ యింకా ఏమిటో స్వోత్కర్ష మొదలు పెట్టాడు.

అన్నిటికీ 'ఊఁ' అంటున్నానన్నమాటే గాని 'యితణ్ణి యెలాగు మరమ్మతుచేద్దామా' అనే ఆలోచనలో మునిగిఉన్న నాకు అతడి మాటలు బుర్రకెక్కటంలేదు. నాస్థితి కొంచెం గ్రహించి కాబోలు,

"ఆవిడభర్తగారి కేం పని ?"

"ప్లీడరీ."

"మంచి రిఫార్మరా ?"

"...అంటే ?...'అందంగా ఉంటారా?' అనా... లేదు, నల్లగానే ఉంటారు."

"(వికటంగా నవ్వి) ఛా...అది కాదు. మంచి సంస్కర్తా? అంటా...పోనీ శారదా బిల్లు పెళ్లిళ్లంటే ఏమంటారు ?"

"ఏవంటారు...? మంచివంటారు !"

"ఫ్రీలవ్ సొసైటీలంటే ... అంటే స్వేచ్ఛా...?"

"అదా... ఆమధ్య బెజవాడలో పుట్టి..."

"ఆఁ ! అదే. నీకు కూడా తెలిసిందే ? దాని విషయ మేమంటారు?"

"నాతో ఏమీ అన లేదుగాని, స్నేహితులతో 'మరీ పోయేకాలం......' అంటూంటే విన్నాను.'

"ఆవిడేమంటుంది ?"

"...నేను చెప్పగలనా?...అసలు మీ ఉద్దేశ మేమిటి ఆ సొసయిటీలంటే ?"

"ఏమిటేమిటి ? ఇందాకే చెప్తినే, మన దేశాన్ని మరమ్మతు చేస్తానని. అందులో యీ సొసైటీలకోసం ప్రత్యేక కృషిచేస్తాను."

ఇహ నాకు లెక్చరివ్వడం మొదలు పెట్టాడు, ఆ సొసైటీల ఉద్దేశాన్ని గురించీ, ఉత్కృష్టతను గురించీ, వాటి లాభాలను గురించీని కాని తల తిరిగిపోతున్నట్లుంది నాకు, అతణ్ణి గురించి ఆలోచిస్తుంటే. కళ్లు మూసుకుని అల్లాగే కూర్చున్నాను.

* * * *

పన్నెండు గంటలు దాటింది కాబోలు ప్రతిఫ్యాక్టరీ కూత కూస్తోంది. రైలు ప్లాటు ఫారంమీద ఆగింది. నా యీ మిత్రుడు రైలుదిగి మా సామాను దింపిస్తూ 'నంద్యాల వచ్చింది దిగ'మని నన్ను లేపాడు నా విచిత్రావస్థలోంచి. రైలు దిగేసరికి (మా వెంకట్రావు ముందే తెలియబరిచాడు గావల్ను) మా మామగారు, స్నేహితులూ అంతా మా చుట్టూ చేరారు. కన్ను మూసి కన్ను తెరిచేలోపల నామెడనిండా పూలదండలున్నాయి.

మరుక్షణం విస్తుపోయిన వదనంతో మన 'స్వేచ్ఛావిహారి' నా రెండు చేతులూ పట్టుకుని "ఇవి పాదాలుగాని చేతులు కావు. నా తప్పు క్షమార్హంకాదని నాకు తెలుసు. కాని మీ యీ విశాలహృదయంలో, యీ దురదృష్టవంతుణ్ణి క్షమించి, చోటిస్తేనే యీ జీవి బ్రతుకుతాడు — లేకపోతే......" అంటూ దుఃఖంతో కుమిలిపోతూ మొదలు నరికిన వృక్షంలాగు కూలబడ్డాడు.

ద్రవించిన హృదయాన్ని పదిలపరచుకుని "నాయనా! క్షమించవలసింది నేను కాదు... నీలాటి యువకులంతా యీవిధంగా పోకుండా మీ ధనాన్నీ, శక్తినీ, బుద్ధినీ సరి అయిన మార్గాల్లో వినియోగిస్తే నిజంగా మన దేశము 'మరమ్మతు' అవుతుంది. అందుకు భగవంతు డనుగ్రహించుగాక..."

బసవపురాణము వెల 2-8-0

గ్రంథకర్త:— పాల్కురికి సోమనాథకవి పరిష్కర్త:— వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

పంద్రెండవ శతాబ్దమున వెలసిన శైవమతప్రతిపాదకమగు ద్విపదకావ్యము. ఇందు శైవమతోద్ధారకు డగు బసవేశ్వరునియు, తత్పూర్వులు తత్సమకాలీనులు నగు శివభక్తులయు చరిత్రములను సరసముగను, పాఠకులు మనసుకరగి తన్మయులగునట్లుగను, కవి వర్ణించినాడు. గ్రంథమున మృదుమధురములగు జానుతెనుగు పలుకుల జాలువార్చి రచనమున ముద్దులుగురిపించినాడు. గ్రంథము భిన్న భిన్న మండలములకు జెందిన పెక్కు తాళపత్ర మాతృకలతో పరిశీలించి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పుటలు) ఇందు గలదు. ఆకాలపు టపూర్వసారస్వత చారిత్రక విశేషముల లెక్కకు మిక్కిలిగ నందు పరిష్కర్త యేర్చికూర్చినారు. ఆధునిక కవికుమారుల కిది యత్యంతోపకారకము.

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల, నెం. 2, సంబుసెట్టివీధి, మదరాసు.